క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానించిన షాదుల్లా

కంగ్టి(నారాయణఖేడ్): మాఘి గాయత్రి షుగర్స్ కంపెనీ సీడీసీ చైర్మన్‌గా ఇటీవల నియామకమైన ఎండీ షాదుల్లా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవ్‌రెడ్డికి ఆయన నివాసంలో శనివారం సన్మానించారు. సీడీసీగా తమ ఎంపికకు సహకరించినందుకు ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాదుల్లాకు అభినందనలు తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక



శివసేనరెడ్డిని సత్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డిని సెట్విన్ చైర్మన్, మాజీ ఎంపీపీ ఎస్.గిరిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

యువత పాత్ర కీలకం

పటాన్‌చెరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు యువతకు పెద్దపీట వేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన జిల్లా అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో యువత పాత్ర కీలకంగా మారిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలోను, పార్టీల కార్యకలాపాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల వద్దకు చేర్చడంలోను యువత అవసరమని చెప్పారు. యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎంఐఎం నేత

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మొహిద్ పటేల్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాల సమస్యలపై విన్నవించారు. పలువార్డులు, కూరగాయల మార్కెట్, ప్రధాన కూడళ్ల వద్ద వర్షపునీరు నిలిచి రోడ్లు పాడవుతున్నాయని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

బైక్‌కు నిప్పు

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని బడంపేటలో ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైకుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. బడంపేటకు చెందిన గడ్డంమీది బాల్‌రాజ్ తమ మోటారు సైకిల్‌ను శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉంచాడు. రాత్రి 3గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దానిపై పెట్రోల్‌పోసి నిప్పంటించారు. బాల్‌రాజ్ కోహీర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమలో విధులకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారంలో చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహులు ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన 12వ తేదీన విధులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో పరిశుభ్రత పాటించండి, రోగాలను తరిమికొట్టండి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి, బహిరంగ ప్రదేశాల్లో చెత్తపారబోయ వద్దని సూచించారు.

బడికి పోయేదెలా?

- పేర్చిన రాళ్లపైనే రాకపోకలు
- ఇరుకు గదుల్లోనే చదువు
- విద్యార్థులు, పాఠశాలకు రక్షణ కరువు



ఇరుకు గదుల్లోనే సాగుతున్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని నాయకులు చెబుతున్నా అది సక్రమంగా అమలు జరగడంలేదు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. పథకాలు రూపొందిస్తున్నా కొన్ని పాఠశాలలకే అవి పరిమితం అవుతున్నాయి. చిన్నారులను బడి బాట పట్టించేందుకు ఉపాధ్యాయులు కూడా గ్రామగ్రామానికి తిరిగి ప్రచారం చేశారు. కాని చాలా స్కూళ్లలో కనీస వసతులు కరువయ్యాయి. వర్షాలు కురవడంతో బడికి వెళ్లే దారులు దుర్భరంగా మారాయి. తగిన తరగతి గదులులేక బోధన కష్టతరంగా మారింది. ప్రహరీలు లేక రక్షణ కరువవుతోంది. – సంగారెడ్డి టౌన్



పాఠశాలకు వెళ్లే దారి..



విద్యార్థులు వెళ్లడానికి పరుచుకున్న రాళ్లు

అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చినుకు పడితే చాలు ఆ పాఠశాలకు వెళ్లే దారి మొత్తం చిత్తడిగా మారుతుంది. ఈ దుస్థితి జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణ పరిధిలోని చింతలపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొంది. అక్కడ తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు పక్కపక్కనే ఉన్నాయి. తెలుగు మీడియంలో 19మంది విద్యార్థులు, ఉర్దూ మీడియంలో 30మంది చదువుతున్నారు.

చేరుకోవడం చాలా కష్టం

పాఠశాలకు వెళ్లేందుకు దారి సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. దీంతో విద్యార్థులు పక్క నుంచి ఉన్న గడ్డి మధ్యలో రాళ్లు పేర్చుకొని వాటిమీదుగా అడుగులు వేసుకొంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఆ సమయంలో విషసర్పాలు కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

రక్షణ కరువు

ప్రహరీ లేకపోవడంతో పాఠశాలకు, విద్యార్థులకు రక్షణ కరువైంది. విషసర్పాలు, కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తున్నాయి. మరోపక్క మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల నిర్వహణ సైతం సక్రమంగా లేదని, ఇరుకు గదుల్లో బోధన సాగుతోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పాఠశాల భవన నిర్వహణతోపాటు రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక నేతలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పిల్లలకు దారి చూపాలంటున్నారు.

ప్రమాదాల చౌరస్తా



పస్తాపూర్ చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన మురుగుకాలువ

- అసంపూర్తిగా మురుగు కాలువ పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

జహీరాబాద్ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పస్తాపూర్ చౌరస్తా వద్ద చేపట్టిన మురుగు కాలువ పనులు నెలలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో కాలువ కోసం తీసిన గుంతల్లో అదుపుతప్పి వాహనాలు పడిపోతున్నాయి. ఇప్పటి వరకు అనేక మంది కాలువలో పడి గాయాలబారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. జహీరాబాద్–హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిలో ఉన్న పస్తాపూర్ చౌరస్తా వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. చౌరస్తా నుంచి ఝరాసంగం, హైదరాబాద్‌కు వెళ్లేందుకు దారులు ఉన్నాయి. అయితే ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల రాక కోసం చౌరస్తాలో ఎదురుచూస్తుంటారు. చౌరస్తా పక్కనే డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. కానీ పనులు ఇప్పటి వరకూ పూర్తి చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.



కారును బయటకు తీస్తున్న సిబ్బంది (ఫైల్)

అదుపు తప్పుతున్న వాహనాలు

కాలువల కోసం కోసం పెద్దపెద్ద గోతులు తవ్వారు. అయితే కల్వర్టు పనులు చేపట్టి కాలువ పనులను అసంపూర్తిగా వదిలేశారు. మూలమలుపులో పెద్ద గుంత ఉండటం వల్ల జహీరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అదుపుతప్పి కాలువలో పడుపోతున్నాయి. ఇప్పటివరకు ఎంతోమంది వాహనదారులు అదుపు తప్పి కాలువలో పడిన గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువల పనులు పూర్తిచేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నారాయణఖేడ్/జహీరాబాద్ టౌన్: స్థానిక శ్రీసత్యసాయినికేతన్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు హైదరాబాదు శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు శంకరప్ప తెలిపారు. క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి నానక్‌రాంగూడలోని శంకర్ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ సురేశ్ షెట్కార్‌కు సన్మానం

జహీరాబాద్ టౌన్: ఎంపీ సురేశ్ షెట్కార్‌కు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, ఆర్.సుభాష్ తెలిపారు. పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాలులో సాయంత్రం 6గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సమాజ్ నాయకులు, వీరశైవ లింగాయత్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

జహీరాబాద్: జహీరాబాద్ ఎస్‌ఐగా కాశీనాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన లక్ష్మారెడ్డి పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తాండూర్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన కాశీనాథ్ జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

ఎస్‌ఐకి శుభాకాంక్షలు

మునిపల్లి(అందోల్): బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్‌ను సీపీఎం మండల నాయకుడు రమేశ్‌గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. శనివారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరమేశ్వర్ పాల్గొన్నారు.





రాజేశ్‌నాయక్‌ను సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్.. బాధ్యతలు చేపట్టిన కాశీనాథ్

సమృద్ధిగా వర్షాలు కురవాలి

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సిరి సంపదలతో తులతూగాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆకాంక్షించారు. శనివారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న బోనాల పండుగలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమ్మవారి దయతో వానలు కురవాలని కోరుకున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మహాపూజ, చండీ హోమం, శ్రీలలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



పాదయాత్ర నిర్వహిస్తున్న రాసోల్ గ్రామస్తులు

వరుణుడా.. కరుణించవా..

కంగ్టి(నారాయణఖేడ్): వానలు కురిపించి పంటలకు జీవం పోయాలని వేడుకుంటూ మండలంలోని రాసోల్ గ్రామానికి చెందిన రైతులు, మహిళలు 11గ్రామాల్లోని శ్రీహనుమాన్ ఆలయాల్లో విగ్రహానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. వార్‌కరీ సంప్రదాయంలో భజనలు చేస్తూ ఊరూరా పాదయాత్రగా వెళ్లి పూజలు నిర్వహించారు. మహిళలు నిండు కలశాలతో, తులసి మొక్క తలపై పెట్టుకుని అన్ని ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేశారు. దేవుడా వర్షం కురిపించి కరుణించమని వేడుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జలాభిషేకాలు..

నారాయణఖేడ్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని సంజీవన్‌రావుపేట్, పోతన్‌పల్లి, గంగాపూర్, కొండాపూర్, కద్పల్ గ్రామాలకు చెందిన ప్రజలు హనుమాన్ ఆలయాల్లో శనివారం జలాభిషేకాలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సక్రమంగా వర్షాలు కురవలేదని, పంటలు ఎండుముఖం పట్టాయ ని వారు వేడుకున్నారు. అనంతరం ఆలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు.

హనుమాన్ ఆలయానికి భక్తుల తాకిడి

నారాయణఖేడ్: మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన కొండాపూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ప్రతీ శనివారం వివిధ ప్రాంతాల నుండి భక్తులు దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో తరలి వస్తారు. రెండో శనివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో ప్రసాద వితరణ చేశారు.



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

నాసిరకం వెల్లుల్లి పేస్ట్ పట్టివేత

ఒక వ్యక్తిని అరెస్టుచేసిన పోలీసులు

కంది(సంగారెడ్డి): నాసిరకం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై పోలీసులు దాడిచేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో రూరల్ సీఐ అశోక్ కుమార్ వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని జుల్కల్‌లో మహమ్మద్ వసీమ్ కొన్ని రోజులుగా నాసిరకం వెల్లుల్లి, ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలతో పేస్ట్ తయారుచేసి విక్రయిస్తున్నాడని చెప్పారు. సమాచారం మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆ తయారీ కేంద్రంపై దాడిచేసి 600కిలోల నాసిరకం పేస్టును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే వసీమ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్ఐ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ అశోక్ కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మున్సిపల్ చైర్పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాలనీల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శనివారం వైద్యశిబిరాలు నిర్వహించి స్థానికులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల ఎదుట నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులన చేపట్టాలని చెప్పారు. మున్సిపల్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న రోజారాణి

'మహిళ'కు పెద్దపీట

గ్రామాలలో మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టింది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు స్వయం సమృద్ధి సాధించడంతో పాటు మరో పది మందికి ఉపాధి చూపించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటును ప్రోత్సహించనుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన పట్టణాల్లో ఐదు క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు అమలు చేయనున్నారు. మహిళా శక్తి పేరుతో మహిళల వ్యాపార ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు అన్ని జిల్లాలకు లక్ష్యాలను నిర్దేశించగా, వాటిపై ఆసక్తి చూసిన మహిళా సంఘాల వివరాలను సేకరిస్తున్నారు. – సంగారెడ్డి టౌన్



మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

- బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి నుంచి రుణాలు
- వ్యాపార వేత్తలుగా మారడమే లక్ష్యం
- మహిళాశక్తి పేరుతో 13రకాల పథకాలు
- ఆసక్తి ఉన్న వారికి శిక్షణ, ప్రోత్సాహం

జిల్లా వ్యాప్తంగా 18369మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో ఒక 1.94లక్షల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. వారికి ప్రతి సంవత్సరం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. వాటితోపాటు ఇకపై మహిళా శక్తి పేరుతో వ్యాపారాల ఏర్పాటుకు ప్రత్యేక రుణాలు అందించనున్నారు. మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదుగుతూ వారు మరో 10మందికి ఉపాధి కల్పించే విధంగా ముందుకు సాగనున్నారు. సంఘాల ఆధారంగా 50వేల మొదలుకొని లక్షల్లో బ్యాంకుల రుణాలు ఇవ్వనున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యాపారాలు ఏర్పాటు చేయనున్నారు.

13రకాల రుణాలు

మహిళా శక్తి పేరుతో 13రకాల రుణాలు అందజేనున్నారు. కుట్టు కేంద్రాలు, చిన్న తరహా పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, మీసేవ కేంద్రాలు, మహిళా క్యాంటీన్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, పౌల్ట్రీ, యానిమల్, సోలార్, ప్లాస్టిక్, మొబైల్, ఫిష్ సెంటర్లు, పాల ఉత్పత్తి కేంద్రాలు, కష్టమ్ ఇయర్ రింగ్స్ కేంద్రాలు తదితర యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణ ఇప్పించి రుణాల అందించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు కేంద్రాలలో క్యాంటీన్‌లు

మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో ఐదు క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నారు. సంగారెడ్డిలో రెండు, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరులో ఒక్కొక్కటి చొప్పున నెలకొల్పడానికి నిర్ణయించారు. నాణ్యమైన ఆహారం, అల్పాహారం, భోజనం వంటివి విడతల వారీగా అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో దుస్తులను కుట్టే బాధ్యతలను అప్పగించారు. క్యాంటీన్‌ల ఏర్పాటుకు మరింత కృషిచేసే అవకాశాలు ఉన్నాయి. మహిళా సంఘాలకు ఒక్కో యూనిట్ విలువను 15లక్షల నుంచి 25లక్షల వరకు నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల, గ్రామ స్థాయిలలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

వ్యాపారవేత్తలుగా ఎదగడమే లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో మహిళలను వ్యాపారవేత్తలుగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారు ఆర్థికంగా ఎదిగేందుకు, అలాగే స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మహిళా శక్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయనున్నాం. మహిళలకు అన్ని విధాలుగా బ్యాంకు రుణాలు ఇప్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం.

– జంగారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి